క్లుప్తంగా

విశ్రాంత ఉద్యోగుల సహకారం ఉండాలి


మాట్లాడుతున్న ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సహకారం నిరంతరం ఉండాలని మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు కోరారు. హాజీపూర్‌ మండలం గఢ్‌పూర్‌లోని దుర్గాదేవి క్వారీ ప్రాంతంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీకి మద్దతుగా నిలిచి విజయం అందించాలని కోరారు. ఈ క్రమంలో విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో, తనవంతు బాధ్యతగా సహకారం అందిస్తానన్నారు. భవిష్యత్‌లో విశ్రాంత ఉద్యోగుల సహాయ, సహకారాలు ఉండాలని, అందరి మద్దతుతోనే ప్రభుత్వ ఏర్పాటు జరిగితే కాంగ్రెస్‌ పార్టీ పూర్తి అండగా నిలుస్తుందని విశ్రాంత ఉద్యోగులకు హామీ ఇచ్చారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి


కార్మికులతో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

నస్పూర్‌: శ్రీరాంపూర్‌ ఏరియాలో పనిచేస్తున్న లోడింగ్‌ అన్‌లోడింగ్‌ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని లోడింగ్‌ అన్‌లోడింగ్‌ యూనియన్‌ అధ్యక్షుడు ఏనుగు రవీందర్‌రెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్‌లో యూనియన్‌ జనరల్‌ బాడీ సమావేశం ఆదివారం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై చర్చించి, పలు తీర్మానాలు చేశారు. ఇళ్లు లేని వారికి డబుల్‌ బెడ్‌రూం ఇళ్లు ఇప్పించాలని, ఇళ్ల స్థలాలు ఉన్న వారికి రూ.3లక్షలు ఇవ్వాలని తీర్మానం చేశారు. నెలవారి జీతం సరిపోవడం లేదని, లారీ ట్రాన్స్‌పోర్టు యజమానులతో చర్చలు జరిపి జీతాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో భీరయ్య, రాజేశ్‌, రమేశ్‌, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడిద్దాం'


మాట్లాడుతున్న మాజీ ఎంపీ రాథోడ్‌ రమేశ్‌

జన్నారం: ప్రజావ్యతిరేఖ విధానాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్‌ను రాబోయే ఎన్నికల్లో ఓడించాలని మాజీ ఎంపీ రాథోడ్‌ రమేష్‌ పిలుపునిచ్చారు. జన్నారం మండలం కవ్వాల్‌లో ఆదివారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో సర్వాయిపాపన్న, అంబేద్కర్‌, శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్‌ఎస్‌ను గద్దెదించి, రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీని అధికారంలోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శంకరయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు గోలి చందు, నాయకులు మధుసూదన్‌రావు, శేఖర్‌, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను గెలిపించడానికి ప్రజలు సిద్ధం'


మాట్లాడుతున్న రామిళ్ల రాధిక

జైపూర్‌: వచ్చే ఎన్నికల్లో వచ్చేది కాంగ్రెస్‌ ప్రభుత్వమేనని కాంగ్రెస్‌ పార్టీ నాయకురాలు రామిళ్ల రాధిక పేర్కొన్నారు. మండలంలోని టేకుమట్ల గ్రామాన్ని ఆదివారం సందర్శించి గ్రామంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్‌, చెన్నూర్‌ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ నియోజకవర్గాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. గ్రామంలో ఇంతవరకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇచ్చిన దాఖలాలు లేవని, గతంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు ఉన్నాయని తెలిపారు. ప్రజలకు విసుగుచెంది కాంగ్రెస్‌ను గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్‌ పార్టీలో చేరగా, కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


ఈ ఫొటోలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ బెల్లంపల్లి మండలం మాలగురిజాల గ్రామంలోనిది. నెన్నెల-బెల్లంపల్లి ప్రధాన రోడ్డును ఆనుకుని భూమికి తక్కువ ఎత్తులో ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌ ప్రభుత్వ పాఠశాలకు కూత వేటు దూరంలో ఉంది.

ఈ చిత్రంలో కనిపిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్‌ నెన్నెల మండల కేంద్రం లోనిది. ప్రధాన రహదారి పక్కనే ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్‌ ఉంది. కంచె లేకుండా చేతికందే ఎత్తులో ఉండటంతో ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.




ఈ ఫొటోలో కనిపిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు కన్నెపల్లి మండలం మెట్‌పల్లి గ్రామంలోనివి. వీటికి కంచె ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రోజువారీగా మూగజీవాలు సంచారం చేస్తుంటాయి. రైతులు పొలాలకు ఈ మార్గం మీదుగానే వెళ్తుంటారు. ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాల్సి ఉంది.

కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు


బెల్లంపల్లి కొత్త బస్టాండ్‌ కల్వర్టు వద్ద కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్‌

- చేతికందే ఎత్తులో కూడా..
- పొంచి ఉన్న ప్రమాదం
- భయాందోళనలో ప్రజలు

బెల్లంపల్లి: నియోజకవర్గంలో కంచె లేని విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం పొంచి ఉంది. రోడ్డు పక్కన, ఇళ్ల పరిసరాలను ఆనుకుని ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో ప్రజలు భయం భయంగా గడపాల్సి వస్తోంది. కొన్నిచోట్ల చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు రక్షణ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. బెల్లంపల్లి విద్యుత్‌ డివిజన్‌ పరిధిలో ఓ మున్సిపాలిటీ, ఏడు మండలాలున్నాయి. వీటి పరిధిలో 13 సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో రెండు, వేమనపల్లి, తాండూర్‌, కన్నెపల్లి, భీమిని, నెన్నెల మండలాల్లో రెండేసి చొప్పున, కాసిపేట మండలంలో ఓ సబ్‌స్టేషన్‌ ఉంది. వీటి పరిధిలో అనధికారిక లెక్కల ప్రకారం దాదాపు 400 చేరువలో ట్రాన్స్‌ఫార్మర్లను నెలకొల్పారు. కరెంట్‌ సరఫరాలో అవరోధాలు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. వీటికి రక్షణగా కంచె నిర్మించకపోవడంతో ప్రమాదకరంగా తయారయ్యాయి. ఏటా విద్యుత్‌ ప్రమాదాలు జరుగుతున్నాయి. మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. గ్రాసం కోసం కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్‌ వద్దకు వెళ్లి విద్యుత్‌షాక్‌ తగిలి మృత్యువాత పడుతున్నాయి. అదే రీతిన మానవులు సైతం ప్రమాదాల బారిన పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

చర్యలు తీసుకుంటాం

ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. భూమికి తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె నిర్మిస్తాం. వీలైనంత వరకు ప్రమాదాలు జరగకుండా కట్టడి చేస్తాం.

– బి.రాజన్న, డిస్కం డీఈ, బెల్లంపల్లి డివిజన్‌

పట్టువదలకుండా పంచాయతీ కార్మికుల సమ్మె


నినాదాలు చేస్తున్న కార్మికులు


దండేపల్లి: నిరసన తెలుపుతున్న కార్మికులు

బెల్లంపల్లి: డిమాండ్ల పరిష్కారం కోసం గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారంతో 11వ రోజుకు చేరింది. పంచాయతీ కార్మికులు అంకుఠిత పట్టుదలతో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రోజుకో రీతిన నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దినదినం సమ్మెప్రభావం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. బెల్లంపల్లి మండల ప్రజాపరిషత్‌ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు రోజువారీగా రెట్టింపు ఉత్సాహంతో సమ్మెను కొనసాగిస్తున్నారు. వివిధ రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాల బాధ్యులు దీక్షా శిబిరాన్ని సందర్శించి కార్మికులకు సంఘీభావం ప్రకటిస్తున్నారు. ప్రభుత్వం దిగి వచ్చి డిమాండ్లను అంగీకరించే వరకు సమ్మె నిర్వహిస్తామని గ్రామపంచాయతీ కార్మికులు స్పష్టం చేస్తున్నారు.

ఒంటికాలిపై నిలబడి నిరసన

దండేపల్లి: జీపీ కార్మికుల నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం దండేపల్లిలో జీపీ కార్మికులు రిలే దీక్ష శిబిరంలో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తమ న్యాయపరమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. మండలంలోని అన్ని గ్రామాల జీపీ కార్మికులు పాల్గొన్నారు.

నేడు కాసిపేట సంక్షేమ గురుకులంలో స్పాట్‌ అడ్మిషన్లు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కాసిపేట బాలుర గురుకుల ఆర్ట్స్‌ కళాశాలలో ఇంటర్మీడియెట్‌ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం ఈ నెల 17వ తేదీ(సోమవారం) స్పాట్‌ అడ్మిషన్లను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ వి.సంతోష్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఖాళీ సీట్లు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. ఎంఈసీ గ్రూపులో 24సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఇందులో ఎస్సీ-20, ఎస్టీ-2, మైనార్టీ-1, ఓసీ-1వర్గాలకు కేటాయించినట్లు తెలిపారు. సీఈసీ గ్రూపులో 20సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఎస్సీ-16, ఎస్సీ-1, ఎస్టీ-1, మైనార్టీ-1, ఓసీ-1 చొప్పున ఆయా సామాజికవర్గాల విద్యార్థులకు రిజర్వు చేసినట్లు వివరించారు. స్పాట్‌ అడ్మిషన్ల కోసం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4:30గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు పూర్తి సమాచారం కోసం 9505177154, 9948575365, 7995019572 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

నస్పూర్‌: పట్టణ పరిధిలోని నస్పూర్‌కాలనీ మనోరంజన్‌ సముదాయంలో మంగళవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహించే ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీజీఎం(పర్సనల్‌) అరవిందరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణుడు విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో దీర్ఘకాలిక రోగాలు బీపీ, షుగర్‌, కీళ్లనొప్పులు, నడుం నొప్పులు వంటి వాటికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమున్న వారికి మందులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఆయుర్వేద వైద్య శిబిరం

మందమర్రిరూరల్‌: ఏరియాలోని సీఈఆర్‌ క్లబ్‌ ఆవరణలో సోమవారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఏరియా పర్సనల్‌ మేనేజర్‌ శ్యాంసుందర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఆయుర్వేద డాక్టర్‌ విశ్వనాథ మహర్షి అందుబాటులో ఉంటారని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్యవర్గం ఎన్నిక

దండేపల్లి: పూసల యువజన సంఘం దండేపల్లి మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఖమ్మం అంజన్న, అధ్యక్షుడిగా చీర్ల ర మేష్‌, ఉపాధ్యక్షులుగా చీర్ల సంతోష్‌, సేన మహేష్‌ , పాదిల గంగన్న, ప్రధాన కార్యదర్శిగా ముదురుకోళ్ల సురేష్‌కుమార్‌, కోశాధికారిగా చీర్ల తిరుపతి, సంయుక్త కార్యదర్శులుగా చీర్ల వేణు, ఖమ్మం వెంకటేష్‌ ముఖ్య సలహాదారులుగా వెంకటేశ్వర్లు, గంగన్న, స్వామి, కావేటి సత్తన్న, కార్యవర్గ సభ్యులుగా ప్రసాద్‌, శ్రీనివాస్‌, సుమన్‌ ఎన్నికయ్యారు.

దారి మైసమ్మకు వాహనదారుల మొక్కులు

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): ఆషాఢం ఆఖరి రోజు.. దారిమైసమ్మ.. వాడ పోచమ్మకు భక్తులు పెద్ద ఎత్తున మొక్కులు సమర్పించుకున్నారు. గత ఆదివారం క్వారీ దుర్గాదేవి జాతర అంగరంగ వైభవంగా జరగ్గా ఈ ఆదివారం కూడా దుర్గాదేవికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా దుర్గాదేవి పరిసర ప్రాంతాలన్నీ కూడా సామూహిక మొక్కులు, వనభోజనాలతో కిటకిటలాడాయి. వాహనాలకు పూజలు చేసి కోళ్లు, మేకలు బలిచ్చి మరీ అంతా కలిసి సామూహిక వనభోజనాలు చేశారు. ఆషాఢం చివరిరోజు కూడా క్వారీ వనం జనసంద్రంగా మారడంతో, ఎక్కడా కూడా ఖాళీ లేకుండా చెట్ల కింద వంటలు చేసుకుని వనభోజనాలు చేసుకోవడం కనిపించింది.

దండేపల్లి: మండల కేంద్రంలో ఆదివారం ట్రాక్టర్‌ యజమానులు రోడ్డుమైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ట్రాక్టర్లను రోడ్డు పక్కకు నిలిపి, మైసమ్మకు పూజలు చేశారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా, చల్లంగా చూడాలని మొక్కుకున్నారు.

బీఆర్‌ఎస్‌ కార్యకర్తకు పరామర్శ


సందీప్‌రావును పరామర్శిస్తున్న పూర్ణచందనాయక్‌

జన్నారం: మండలంలోని మురిమడుగు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ కార్యకర్త సందీప్‌రావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా, ఆయనను ఆదివారం గ్రీన్‌ ఇండియా చాలెంజ్‌ డైరెక్టర్‌, బీఆర్‌ఎస్‌ నియోజకవర్గ నాయకుడు పూర్ణచంద్‌ నాయక్‌ పరామర్శించారు. వివరాలు తెలుసుకున్నారు. ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని సూచించారు. ఆయన వెంట నాయకులు నరేశ్‌గౌడ్‌, కోడి సృజన్‌ తదితరులున్నారు.

అటెన్షన్‌ ప్లీజ్‌..



మురుగు కాలువలు లేక ఇబ్బంది

భీమారం: మండల కేంద్రంలోని కోదండరామాలయం సమీపంలో రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు వచ్చినప్పుడల్లా మురుగు వ్యర్థాలు, నీరు ఇళ్ల సమీపం నుంచి వెళ్తున్నాయని, దుర్వాసన వెదజల్లుతోందని వాపోయారు. అధికారులు స్పందించి మురుగు కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.
సంబంధిత అధికారి : శ్రీనివాస్‌, కార్యదర్శి నంబర్‌ : 8555898819

బోనమో పోచమ్మ

మంచిర్యాలఅర్బన్‌: స్థానిక రెడ్డికాలనీలో ఆదివారం బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. వర్షం కురుస్తున్నా, బోనాలతో మహిళలు రెడ్డికాలనీ పోచమ్మ ఆలయానికి తరలివెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో బోడ ధర్మేందర్‌, రావు రమేష్‌, చంద్రమౌళి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలఅర్బన్‌: ఆషాఢమాసం పురస్కరించుకుని ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు వైభవంగా జరిగింది. స్థానిక హమాలీవాడ చౌరస్తా నుంచి కట్టపోచమ్మ ఆలయం వరకు బోనాల ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్ల మధ్య పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పసుపు కుంకుమ అలంకరణతో బోనాలు తలపై పెట్టుకుని మహిళలు ముందుకుసాగారు. అనంతరం కట్టపోచమ్మకు బోనాలు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌, పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వరావు, బీజేపీ నాయకులు ఆకుల సంతోష్‌, హరికృష్ణ, పట్టి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

- గాండ్ల సంక్షేమ సేవాసమితి ఆధ్వర్యంలో మంచిర్యాలలో బోనాల ఊరేగింపు వైభవంగా జరిగింది. మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాల మైదానం నుంచి బెల్లంపల్లి చౌరస్తా మీదుగా రాముని చెరువు కట్ట వరకు వెళ్లి పోచమ్మతల్లికి మొక్కులు సమర్పించుకున్నారు. ఎమ్మెల్యే దివాకర్‌రావుతో పాటు డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, సంఘం నాయకుడు ప్రకాశ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్‌: పట్టణంలోని కేకే-1 సీఎస్పీ సమీపంలోని దుర్గాభవాని అమ్మవారి ఆలయంలో ఆదివారం బోనాల వేడుక ఘనంగా నిర్వహించారు. మార్కెట్‌ సమీపంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి మహిళలు బోనాలు ఎత్తుకుని డప్పుచప్పుళ్ల నడుమ కోలాటాలు, డ్యాన్స్‌లు వేస్తూ కేరింతలతో సుమారు మూడు కిలో మీటర్ల వరకు ర్యాలీగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు.

తాండూర్‌: ఆషాఢమాస బోనాలు ఆదివారం తాండూర్‌ మండలం బోయపల్లిలో కనులపండువగా నిర్వహించారు. గ్రామ శివారులో ఉన్న పోచమ్మ గుడి వద్దకు గ్రామీణలు వచ్చి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. సల్లంగా చూడాలని వేడుకున్నారు. ఊరంతా కదిలి రావడంతో బోనాలపండుగా ఆధ్యాత్మికత కొట్టొచ్చినట్లుగా కనిపించింది.

చెన్నూర్‌: పట్టణంలో ఆషాఢమాస బోనాల జాతర ఘనంగా జరిగింది. తెలికల గాండ్ల కులస్తులు ఆదివారం బోనాల జాతర సందర్భంగా శోభాయాత్ర నిర్వహించారు. పాత బస్టాండ్‌ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర మదనం పోచమ్మ వరకు కొనసాగింది. మహిళలు బోనాలు ఎత్తుకొని అమ్మవారి పూనకాలతో యాత్ర కొనసాగించారు. కార్యక్రమంలో గాండ్లకుల సంఘం నాయకులు పిల్లలమర్రి రాజబాపు, శ్రీనివాస్‌, మల్లికార్జున్‌, సాయిలతో పాటు కులస్తులు పాల్గొన్నారు.


చెన్నూర్‌: శోభాయాత్రలో అమ్మవారి పూనకంతో విన్యాసాలు చేస్తున్న హిజ్రా


జిల్లా కేంద్రంలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


చెన్నూర్‌లో గాండ్ల కులస్తుల ఆధ్వర్యంలో బోనాలు


తాండూర్‌: పోచమ్మ గుడి వద్ద భక్తులు

ఘనంగా మడేలయ్య బోనాల జాతర


జాతరలో పాల్గొన్న భక్తులు

నస్పూర్‌: పట్టణ పరిధిలో తెలంగాణ రజక సంఘాల సమితి ఆధ్వర్యంలో ఆదివారం శ్రీశ్రీశ్రీ మడేలయ్య ఆషాఢ బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. సీసీసీ టౌన్‌ షిప్‌ నుంచి భక్తులు బోనాలు నెత్తిన ఎత్తుకుని ఊరేగింపుగా మడేలయ్య దేవాలయానికి చేరుకున్నారు. దేవుడికి బోనాలు సమర్పించి వారి మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ ఈసంపల్లి ప్రభాకర్‌, కౌన్సిలర్‌ పూదరికుమార్‌, తెలంగాణ రజక సంఘాల సమితి మండల అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్‌, కార్యదర్శి తంగళ్లపల్లి బాబు, పుట్టపాక తిరుపతి, దరువుల పైడిద్ద, రాజయ్య పాల్గొన్నారు.